
# దిక్కులేనివారికి...

-మల్లాది రమాంజలి



కోణార్క్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నదనే అనౌన్స్‌మెంట్ వినగానే భారతిని తీసుకుని హడావుడిగా ట్రైన్ ఎక్కాను. నాలుగు రోజుల నుంచీ జ్వర తీవ్రతతో బాధ పడుతున్నందువల్ల నీరసంగా ఉందామె. చేయి పట్టుకుని సీట్లో కూర్చోబెట్టాను.

కిటికీ నుంచి చల్లగాలి తగులుతుండడంతో తను కప్పుకున్న షాల్ తల మీదకు లాక్కుని సీట్‌లో కూర్చుంది భారతి. వారం నుంచీ సరైన ఆహారం లేకపోవడంతో ఆమె బుగ్గలు లోతుకుపోయి కళ్లు నీరసంతో వాలిపోతున్నాయి. ఆమె ప్రక్కనే కూర్చుని తన చేయి నా చేతిలోకి తీసుకున్నాను.

"ఏమండీ... మనూ కనిపిస్తాడంటారా? వాడు వెళ్లి పదిరోజులైంది. మనని వదిలి ఏనాడూ ఉండనివాడు ఇప్పుడు ఎలా ఉన్నాడో? ఎక్కడున్నాడో?'' కన్నీటిని తుడుచుకుంటూ అన్నది.

"ఊరుకో భారతీ... వాడు ఎక్కడున్నా క్షేమంగా ఉంటాడు. రఘునాధ్ చెప్పకపోతే వాడు ముంబైలో వున్నట్లు మనకు తెలిసేది కాదుకదా. మనూని తెల్లవారితే మనం చూడబోతున్నాం. నువ్వేమీ దిగులుపడకు. హాయిగా రెస్టు తీసుకో'' మిడిల్ బర్త్‌వేసి ఆమెను బలవంతంగా పడుకోబెట్టాను.నాకూ మనసులో మనూని ఎప్పుడు చూస్తానా అనే ఆదుర్దా లేకపోలేదు. చదువు పక్కన పెట్టి ఫ్రెండ్స్‌తో సినిమాలు, షికార్లు

చేస్తున్న నా కొడుకు మనోరంజన్‌ని చివాట్లు పెట్టినందుకు ఫలితం... వాడు ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోవడం, మనోవేదనతో భారతీ తీవ్రమైన జ్వరంతో బాధపడడం, నా ఫ్రెండ్ రఘునాధ్ మనూ జాడ చెప్పడంతో మా ఈ ప్రయాణం. ఆ క్షణంలో నా జ్ఞాపకాల పొరల్లో నిక్షిప్తమైన మా మేన మామ రామచంద్రుడు గుర్తుకువచ్చాడు.


నాకో ఏడెనిమిది సంవత్సరాలు ఉండవచ్చు.మా మామయ్య పెళ్లి కుదిరినట్లుగా తాతగారు ఉత్తరం రాయడంతో అమ్మ నాన్నతో ఆ ఊరు వెళ్లాను. ఎర్రబస్సు దిగీ దిగగానే తాతగారి పాలేరు వెంకడు రెండెడ్ల బండితో సిద్ధంగా ఉన్నాడు. బండి దిగగానే అమ్మమ్మ ఎదురొచ్చి అమ్మ చేతుల్లోంచి నన్ను దగ్గరకు లాక్కుని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది. మధ్యాహ్నం భోజనాలు కాగానే అమ్మ, అమ్మమ్మ పెళ్లి బట్టలు సర్దడంలో మునిగిపోయారు. మామయ్య, నేను చల్లగాలికి సాయంత్రం పొలానికి బయలుదేరాం.

"ఏంటండీ రామయ్యగోరూ! ఎల్లుండే పెళ్లెట్టుకుని పొలాలమ్మట తిరుగుతున్నారు? ఏదన్నా పురుగూ పుట్రా ఉంటాయి జాగరత్త'' వెంకడి తమ్ముడు వీరిగాడు హెచ్చరిస్తుంటే తెలిగ్గా నవ్వేసాడు మామయ్య.



## కంగనా డిమాండ్

అందాల్ని తెరపై ఆరేయడంలో పెద్దగా మొహమాటాలు లేని కంగనా రనౌత్ తన పారితోషికాన్ని భారీగా పెంచేసిందిట. ఏకంగా సినిమాకి 5 కోట్లు డిమాండ్ చేస్తోందని బాలీవుడ్ జనాలు చెప్పుకుంటున్నారు. తన కున్న క్రేజ్‌కి తను ఆమాత్రం తీసుకోడంలో తప్పేం లేదని ఆమె సన్నిహితుల దగ్గర చెబుతున్నట్టు కూడా అంటున్నారు. బానే వుంది కానీ, నిర్మాతలందరూ ఆమె అడిగినంత ఇవ్వడానికి రెడీగా వున్నారా? అనేదే సందేహం. అయితే ఒకరిద్దరు నిర్మాతలు మాత్రం కంగనా అడిగినంతా ఇవ్వడానికి ముందుకొచ్చారట. కానీ ఈ డిమాండ్ ఎంతకాలం వుంటుందో కదా!




మామయ్య చెరుకు తోట కేసి నడిపించాడు. చెరుకు ముక్కల్ని తింటూ గట్లమీద ఉన్న పొడవాటి తాడిచెట్లను వింతగా చూస్తూ ఇంటిదారి పట్టాము.

"వాడికి అన్ని చెరుకుముక్కలు పెట్టావేంటిరా తమ్ముడూ... జలుబు చేస్తుంది'' అంటూ చెరుకు ముక్కలన్నీ బయట పారేసింది అమ్మ.

పెళ్లిరోజు రానే వచ్చింది. ఆ రోజు ప్రొద్దుటే మామయ్యను పెళ్లికొడుకును చేసారు. పెళ్లికూతురిది ఆ ఊరే కావడంతో వెంకడి బండిలో ముఖ్యమైన వాళ్లందరం బయలుదేరాం. మా బండి వెనుకే బంధువులంతా మేళతాళాలతో నడుస్తూ ఆడపెళ్లి వారిల్లు చేరుకున్నాం.ఆడపెళ్లివారంతా మాకు ఎదురువచ్చి లోపలకు ఆహ్వానించారు. ఆ రోజు రాత్రి ముహూర్తానికే అత్తయ్య మెళ్లో తాళి కట్టాడు మామయ్య.అమ్మమ్మగారింట్లో ఓ వారం ఉండి మా ఊరు బయలుదేరాము.

మరో వారం తరువాత తాతయ్య వ్రాసిన ఉత్తరాన్ని నాన్నకూ చూపుతూ ఏడవడం మొదలుపెట్టింది అమ్మ.మామయ్య అత్తయ్యను వదిలేసి బొంబాయి పారిపోయాడుట. మామయ్యకు, అత్తయ్యకు మాటా మాటా వచ్చిందిట. అమ్మ నాన్నతో అంటుండగా విన్నాను.

అత్తయ్యతో తన పెళ్లి రద్దు చేసుకుంటున్నట్లుగా మామయ్య అత్తయ్య తల్లిదండ్రులకు విడాకుల కాగితాలు పంపించడంతో వాళ్లంతా తాతయ్యతో ఘర్షణ పడ్డారుట. చేసేదిలేక తాతయ్య వారికి క్షమాపణలు చెప్ప ఆవిడకో ఎకరం పొలం భరణంగా ఇచ్చారట.ఆ తరువాత అత్తయ్య ఒంటరిగానే ఉండిపోయింది. మరో మూడేళ్లకు హిందీ టీచర్‌గా అత్తయ్యకు ఉద్యోగం వచ్చిందని విన్నాను.పెళ్లి కాగానే బొంబాయి పారిపోయిన మామయ్య అక్కడ ఓ మరాఠీ అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడనీ, ఓ పాపకు తండ్రి కూడా అయ్యాడనీ తెలిసింది. మొదట్లో మామయ్యను ఇంటి గడప కూడా తొక్కనివ్వని తాతగారు కొడుకుమీద ప్రేమను చంపుకోలేక ఆ తరువాత రానివ్వడం మొదలుపెట్టారు.మామయ్య కూతురు విరజ పదేళ్ల ప్రాయంలో ఉండగా వాళ్ల అమ్మ చనిపోవడంతో మామయ్య రాకపోకలు తగ్గిపోయాయి. విరజకు ఇరవై సంవత్సరాలకు పెళ్లి అయినట్లు, అల్లుడు ఏదో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు, మామయ్య అమ్మకు ఉత్తరం వ్రాయడంతో ఆయన ఉనికి మళ్లీ తెలిసింది మాకు.

కాలగర్భంలో రోజులు దొర్లిపోతుండగా ఉన్న రెండెకరాల పొలం కొడుకు పేరున వ్రాసి అమ్మమ్మ తాతగారు ఒకేసారి కాలం చేసారు. ప్రతి సంవత్సరం పొలంమీద కౌలు తీసుకోవడానికి ఊరు వస్తుండేవాడు మామయ్య. విరజ పిల్లలు కడిగిన ముత్యాల్లా ఉండేవారు. ఊరు వచ్చినప్పుడల్లా అందరూ మా ఇంట్లోనే బస చేసేవారు. మరుసటి సంవత్సరం మామయ్య కాలం చేసాడని తెలిసింది. ఉన్న పొలం కాస్తా అమ్ముకోవడం వల్ల క్రమంగా విరజతో మా బంధుత్వం తెగిపోయింది.

మరో నాలుగు సంవత్సరాలకు హఠాత్తుగా ఓ రోజు విరజ గురించి ఓ వార్త తెలిసి బొంబాయి వెళ్లాను. ఇల్లు తెలుసుకుని వెళ్లేసరికి చుట్టుపక్కల వారితో ఇల్లంతా నిండిపోయి ఉంది. విరజ శవం కళ్లముందు కనిపిస్తున్నా నమ్మలేకపోయాను. గుండెలవిసేలా ఏడుస్తున్న ఆమె పిల్లల్ని ఇరుగుపొరుగూ ఓదారుస్తున్నారు. వాళ్లద్వారా తెలిసిన విషయం... విరజ భర్త ఆమెను వదిలేసి ఎటో వెళ్లిపోయాడనీ, ఆమె ఆ పనీ ఈ పనీ చేసుకుంటూ పిల్లల్ని పోషించేదనీ, సరైన ఆహారం లేక పైగా మనోవ్యాధితో ఆమె చనిపోయిందనీ, పిల్లల్ని మాకు అప్పచెప్పమని చివరి క్షణాలలో చెప్పిందనీ... ఆమె కథ వింటుంటే నా హృదయం ద్రవించిపోయింది. ఓ క్షణం ఇదివరలో మామయ్య, అత్తయ్యకు చేసిన అన్యాయం ఆ కుటుంబ విచ్ఛిన్నానికి కార

ణమైందా? అనిపించింది. ఏది ఏమైతేనేం...అనాధలైన ఆ పిల్లలను చేరదీసి పోషించే గొప్ప స్థితిలో నేను లేను. ఆ క్షణంలో పసివాడైన నా కొడుకు గురించీ, నా భార్య గురించీ నా కుటుంబం గురించీ ప్రతి సగటు మనిషీ ఆలోచించినట్లే ఆలోచించి విరజ పిల్లల్ని అనాధాశ్రమంలో చేర్చి చేతులు దులుపుకున్నాను.

చాలారోజులు విరజ పిల్లలు నా కళ్లల్లో మెదిలేవారు. దీనమైన వారి చూపులు నన్ను వెంటాడేవి. వారి భాష నాకు, నా భాష వారికీ తెలియకపోయినా వారి మూగ భాష నాకర్థమై నా మనస్సును ఎవరో పిండినట్లుండేది. నిస్సహాయంగా వారిని వదిలేసి వచ్చినందుకు బాధగా ఉన్నా మధ్య తరగతి మానవుడు ఇంతకన్నా ఏం చేయగలడు? అప్పుడప్పుడు శరణాలయానికి ఫోన్ చేసి విరజ పిల్లల క్షేమం కనుక్కోవడం తప్ప నేనేం చేయలేకపోయాను. ఆ తరువాత అదీ మానేసాను.

ఆలోచనల్లోంచి తేరుకుని ఓ క్షణం కునుకు తీసేసరికి తెల్లవారింది. దిగవలసిన స్టేషన్ రానే వచ్చింది. లగేజ్ తీసుకుని క్రిందకు దిగేసరికి ప్లాట్‌ఫారంపై రఘునాథ్ మాకోసం చూస్తున్నాడు. వాళ్లింటికి చేరుకుని స్నానం ముగించాక మనూ ఉన్నచోటుకు తీసుకువెళతానన్నాడు రఘు. తనూ మాతో కలసి వస్తానన్నది భారతి. ముగ్గురం బయలుదేరి రఘు తీసుకువెళ్లిన ఓ పూల దుకాణంలో అడుగుపెట్టాము. షాపంతా రకరకాల పూలు... ఓ మూలగా కూర్చుని ఉన్న ఓ అందమైన అమ్మాయి, మరింత అందంగా పూల బొకేలు తయారు చేస్తోంది. ఆమెకు సహాయం చేస్తూ ఓ పదహారేళ్ల కుర్రాడు... వాడు...మా మనూ!

"మనూ..." అంటూ పరుగునవెళ్లి వాడిని హత్తుకుంది భారతి.

తల్లినీ, తండ్రినీ తలవని తలంపుగా అక్కడ చూడడంతో ఖంగుతిన్నాడు మనూ. మా మాటలు అర్థం కానట్టుగా తదేకంగా చూస్తోంది ఆ అమ్మాయి.మరాఠీలో ఏదో ఆమెకు చెప్పాడు రఘు. ఆమె మాకు వినయంగా నమస్కరించింది. 'అనూ' అంటూ అప్పుడే షాపులోకి అడుగుపెట్టాడో యువకుడు. రఘుని చూడగానే నమస్కరించి మావైపు ప్రశ్నార్థకంగా చూసాడు. మా ఇద్దరినీ మనూ తల్లిదండ్రులుగా అతనికి పరిచయం చేసాడు రఘు. అతను మా ఇద్దరికీ నమస్కారం చేసాడు. మనూ చేతుల్ని అందుకుని చనువుగా నా చేతుల్లో పెట్టాడు. ఆ కుర్రాడిని చూడగానే నాలో ఏదో చిన్న కదలిక. ఎక్కడో చూసినట్లుగా, దగ్గరి పరిచయం ఉన్నట్లుగా... ఈ పిల్లలిద్దరూ ఆ పిల్లలు కాదుకదా! ఏదో మూల చిన్న అనుమానం పెరిగి పెద్దదయింది. నా అనుమానం రఘుకి చెప్పాను. వివేక్ అనబడే ఆ కుర్రాడితో రఘుకి పరిచయం ఉన్నా ఎప్పుడూ వారి స్వవిషయాలలో జోక్యం చేసుకోలేదు. వాళ్లిద్దరినీ మాటల్లో పెట్టి రఘు నాతో చెప్పిన విషయాలు నా అనుమానాన్ని నిజం చేసాయి. ఎప్పుడో పది సంవత్సరాల క్రితం విరజ పిల్లల్ని నిస్సహాయంగా అనాధ శరణాలయంలో వదిలేసినది నేనేనంటే వాళ్లు ఎలా రియాక్టవుతారో తలచుకుంటే సిగ్గుగా ఉంది నాకు.

వాళ్లు చెప్పినదాన్నిబట్టి మనూ ఆ వీధిలో తిరుగుతుంటే వివేక్ తీసుకువచ్చి భోజనం పెట్టి పదిరోజులుగా తన దగ్గరే ఉంచుకున్నాడట. తెలుగు రాని వివేక్ తనకు పరిచయం ఉన్న రఘుతో మనూ గురించి చెప్పడంతో రఘూ మాకు విషయం చెప్పడం, మేము రావడం జరిగింది.

అను, వివేక్‌లతో మాకు దగ్గర సంబంధం ఉన్నా ఆ విషయం వారితో చెప్పలేకపోయాను. రఘుని కూడా చెప్పవద్దన్నాను. వివేక్‌ని మాటల్లో పెట్టి వారి గత జీవితం గురించి కొంతవరకూ తెలుసుకున్నాను. ఆనాడు నేను వారిని ఆదరించి చేరదీసి ఒక్కరోజన్నా గుప్పెడు మెతుకులు పెట్టలేకపోయాను. ఈనాడు మనూని చేరదీసి పదిరోజులు గుప్పెడన్నం పెట్టడమే కాకుండా వాడిని జాగ్రత్తగా మాకు అప్పగించాడు. దిక్కులేని వారికి దేవుడే దిక్కన్నట్లు తల్లీ తండ్రీలేని ఈ అనాధకు దేవుడే ఓ దారి చూపించాడు. కానీ తల్లిదండ్రీ ఉండి కూడా తెలీని ఈ మహా నగరంలో పదిరోజులుగా మనూకి దేవునిలాంటి వివేక్ దిక్కయ్యాడు. తల్లిదండ్రీలేక ఎవరి అండా లేకపోయినా స్వశక్తితో విరజ పిల్లలు పైకొచ్చారు. అన్నీ ఉండి కూడా మా మనూ ఎందుకూ పనికిరానివాడవుతున్నాడు. అది మా పెంపక దోషమా? లేక విరజ పిల్లల ఉసురా? తల్లిదండ్రుల పాపాలే పిల్లలకు శాపాల్లా తగులుతాయంటారు... అది నిజమా? నా గురించి చెప్పుకుని వివేక్ దగ్గర నన్ను నేను చులకన చేసుకోదల్చుకోలేదు. చేతులెత్తి వివేక్‌కి నమస్కరించి ఆయుక్షీణం చేయలేక మనూని మాకు అప్పగించినందుకు కృతజ్ఞతగా ఓ ఐదువేలు వివేక్ చేతుల్లో పెట్టాను. డబ్బు తీసుకోవడానికి మొదట నిరాకరించినా రఘు నచ్చచెప్పడంతో ఆ డబ్బు తీసుకున్నాడు వివేక్. ఆ తరువాత వారిని చల్లగా ఉండమని దీవించి మనూతో మర్నాడే రైలెక్కాం నేనూ, భారతీ!

★



## తగిన శిక్ష

ఇకపై ముంబై లోకల్ ట్రైన్స్‌లో టిక్కెట్లు లేకుండా ప్రయాణించేవారికి జరిమానాలు, జైలుశిక్షలు విధించకుండా వాళ్లచేత రైల్వే టాయ్‌లెట్లు, ప్లాట్‌ఫారమ్స్ శుభ్రం చేయిస్తారుట. జైల్లో పెడితే ఒక్కొక్కరికి రోజుకి 59 రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి వస్తోందిట. దానికి బదులు రైల్వేవారికి లాభించేలా ఈ శిక్షను అమలు జరిపితే మంచిదని గవర్నమెంట్ లా స్కూల్ స్టూడెంట్స్ చెప్పారుట. ఈ శిక్ష ఎంతవరకు అమలు జరుపుతారో కాలమే చెప్పాల్సి ఉంది.

-తటవర్తి

